# అనుభూతి

పోడిగంటి రామచంద్రమూర్తి

నేను ప్రయాణంచేస్తున్న రైలు రాజమండ్రీలో అంతసేపు ఆగటానికి ఆస్కారంలేదు.

తలక్రిందనుంచి చెయ్యితీసి మళ్ళీ 'రిస్ట్‌వాచ్'లోకి చూశాను... అప్పటికే రైలు ఆ స్టేషన్లో ఆగి పదిహేను నిముషాలు దాటిపోయింది... బెర్త్‌మీదనుంచి వంగి క్రిందకు చూశాను.

నాతోబాటే హైదరాబాద్‌లో ఎక్కిన నలుగురు కుర్రాళ్లూ— బహుశా యూనివర్సిటీ స్టూడెంట్సనుకుంటాను— క్రింద సీట్లమీద కూర్చుని, కలగాపులగంగా ఏదో తింటున్నారు.

"ఎక్స్‌క్యూజ్ మీ !"

తింటూనే ఏదో పుస్తకం చదువుతున్న కళ్ళజోడుకుర్రాడు 'ఏమిటీ' అన్నట్లు నావైపు చూశాడు, చేతిలో వున్న పుస్తకాన్ని సగం మూస్తూ.

"ఇక్కడ ఈ రైలు ఎందుకింతసేపు ఆగింది ?"— అడిగాను.

"వైజాగ్‌లో గుడ్స్‌ట్రెయిన్ పట్టాలు తప్పిందట... అందుకే దీన్ని ఇక్కడ పడేశారు... మరో గంటసేపు ఇక్కడే వుంచుతారట"— మళ్ళీ పుస్తకంలో తల దూర్చాడతను. ఈసారి ఆ పుస్తకంవైపు నేనూ చూశాను... అది చెకోవ్ కథల పుస్తకం.

క్రిందకుదిగి 'బాత్‌రూం'కి వెళ్ళి వచ్చాను. ముఖం కడుక్కోవడంవల్ల 'ఫ్రెష్'గా వుంది... కిటికీ ప్రక్కన కూర్చుని దూరంగా పైకి చూశాను. ఆకాశం మన్నుతిన్న పాములా వుంది... అక్కడా అక్కడా పల్చగా మబ్బు పట్టింది... కానీ ఉరుములూ, మెరుపులూ లేవు !

"మీరెంతవరకూ వెడుతున్నారు ?" అంతకుముందు నాకు సమాచారాన్ని ఇచ్చిన కుర్రాడే అడిగాడు.

చెప్పాను.


వాళ్ళింకా తింటూనేవున్నారు. నాకూ ఏదైనా తినాలని అనిపించింది. కానీ పలాసా వెళ్ళేవరకూ ఎంత ఆకలితో వుంటే అంత మంచిది. నేను వెళ్ళగానే, వర్మ తన భార్యకు పురమాయిస్తాడు... అప్పటికప్పుడు ఆవిడ బిరియానీ చేసి పెడుతుంది, హైదరాబాద్‌ని మరపించే బిరియానీ—'నేటివ్‌కాజూ' సువాసనలు వెదజల్లుతూంటే ఎంతైనా తినాలని అనిపిస్తుంది.

నేను అలా తింటున్నంతసేపూ— నా ప్రక్కనే వర్మా, అతని ప్రక్కనే 'స్లీవ్‌లెస్'లో మిసెస్ అవనీ వర్మా కూర్చుని కబుర్లుచెప్తారు. వాళ్ళిద్దర్నీ అలా చూస్తూ —వాళ్లు చెప్పే కబుర్లు వింటూంటే కాలం ఎలా గడుస్తుందో తెలియదు.

వర్మకి జీడిమామిడి తోటలున్నాయి. అతని వ్యాపారం హైదరాబాద్‌లో కూడా బాగా విస్తరించింది. అతను నాకో మంచి స్నేహితుడు... నేను కంపెనీ పనిమీద కలకత్తాగానీ, వాల్తేరుగానీ వెళ్లాల్సివస్తే— ముందుగా పలాసా వెడుతూంటాను... అక్కడ కనీసం రెండురోజులయినా, వర్మదంపతుల ఆతిథ్యం తప్పదు...

ఈసారి వర్మకి ఏదైనా తీసుకెడితే ?...

ఆలోచన వచ్చిన వెంటనే, కంపార్ట్‌మెంట్‌లోంచి క్రిందకు దిగి బయటకు నడిచాను. ఎదురుగా పళ్ళదుకాణం కనిపించింది. మామిడిపళ్లు నవనవలాడు



తున్నాయి. బేరం చేయకుండానే, వంద పళ్లు బుట్ట కట్టించాను. ఆ ప్రక్కనే మామిడితాండ్ర అమ్ముతున్న కుర్రాడు కనిపించాడు. వాడి వంటిమీద పదిహే నేళ్లు వుంటాయో లేవో కానీ, వాడిమాటల్లో వున్న వ్యాపార లౌక్యం మాత్రం- ఓ పెద్ద కంపెనీకి 'బిజినెస్ ఎగ్జిక్యూటివ్'గా వున్న నన్ను చిత్తు చేసింది. వాడిదగ్గర మామిడితాండ్ర కూడా కొని, మళ్ళీ కంపార్ట్‌మెంట్‌లోకి వచ్చాను.

అంతవరకూ గందరగోళంగా మాట్లాడుకుంటున్న నలుగురు కుర్రాళ్లూ, నన్ను చూసి భయపడినట్టు ఆగి పోయారు.

నేను మళ్ళీ బెర్తుమీదకు ఎక్కాను.

వాళ్ళు మళ్ళీ కబుర్లు ప్రారంభించారు.

'అమ్మాయిల కథ ఏదైనా చెప్పమని- ఆ కళ్ళజోడు కుర్రాడ్ని- అతని పేరు 'చంద్రమౌళి' అని వాళ్ల మాట్లాడు కుంటూంటే గ్రహించాను— అడుగు తున్నారు. అతను... అదే, మౌళి, ఎందుకో మొహమాటపడుతున్నాడు. వాళ్లు మరీ మరీ అడుగుతున్నారు. కళ్లు మూసుకున్న నాకు నిద్రపట్టేసింది.

మళ్ళీ మెలకువ వచ్చేసరికి కథ నడుస్తోంది. వాళ్లు నిశ్శబ్దంగా వింటున్నారు. మౌళి సీరియస్‌గా చెబుతున్నాడు.

"......అతనికి అంతా కృత్రిమంగానూ అసభ్యంగానూ కనిపించింది. అక్కడ అందరికీ తోడుగా జతకట్టే అందమైన ఆడపిల్లలున్నారు. వాళ్ళ నవ్వులు పేలవంగా వున్నాయి. ఇక వాళ్ళ కళ్ళల్లోకి ఎలా చూడగలడు? అందుకే ఆ పార్టీనుంచి బయటపడాలను కున్నాడు. అక్కడనుంచి లేచాడు. ముందుకు నడవబోయే ముందు—గ్లాసులో మిగిలిన విస్కీని గడగడా త్రాగేశాడు.

"......పిడికిళ్ళు బిగించి, ఆర్మీ ఆఫీసరు కనుక- హుందాగా నడుస్తున్నాడు. అతను బయటకు రావాలంటే ఎన్నో వరండాలు దాటాలి. అంతా చీకటిగావుంది. కళ్ళకు అలవాటు పడిన తర్వాత- అంతా మసక మసగ్గా కనిపించే ఆ లేతచీకటి అతనికి హాయిగా వుంది. ఆ చీకటి హాయిలో- ఎంతో మందితో తాను 'డాన్స్' చేస్తున్నట్లు ఊహించుకున్నాడు.

"......ఉన్నట్టుండి అతను నడుస్తున్న వరండాలో ఎడంవైపు గది తలుపులు తెరచుకున్నాయి. మరుక్షణంలో ఒకామెవచ్చి అతన్ని పెనవేసుకుంది. పెదాలమీద గట్టిగా-ఊపిరిసలుపనంతగా ముద్దుపెట్టుకుంది. ఆ ముద్దులోనూ, ఆమె స్పర్శలోనూ, ఎన్నేళ్ళ ఎదురుతెన్నులో కరిగిపోయి, వెచ్చతనం కనిపించింది అతనికి."

"......కానీ ఆశ్చర్యం! వెంటనే ఆమె పెద్దగా కేకవేసి, ఆ చీకట్లోకి పారిపోయింది."

"ఎందుకూ ?"- తక్కిన ముగ్గురూ మౌళిని ఆత్రంగా అడిగారు.

నా గొంతులోనూ అదే ప్రశ్న !

మౌళి మళ్ళీ చెబుతున్నాడు. నేనూ వింటున్నాను.

"...... ఆ అమ్మాయి 'వెయిట్' చేస్తున్నది అతనికోసం కాదు. మరెవరి కోసమో! అందుకే అతనిలో- తాను ఆశించిన చలనం లేకపోయేసరికి-చీకట్లో కూడా పసికట్టేసింది. కెవ్వున అరచి పారిపోయింది. కానీ అతను? అతనికిమాత్రం అదో విచిత్రమైన అనుభూతి. అంతవరకూ అతను ఎవర్నీ ముద్దుపెట్టుకోలేదు. ఆర్మీలో వుంటున్న వాళ్ళు కావాలంటే సుఖాన్నికూడా డబ్బుతో కొనుక్కోగలరని అతను విన్నాడు. కానీ అలా డబ్బులిస్తే వచ్చి కోరిక తీర్చే ఆడదానికీ-ట్రిగ్గర్ నొక్కితే పేలే తుపాకికీ తేడా లేదనుకుని-బ్రహ్మచర్యం పాటిస్తున్నాడు." చెప్పటం ముగించాడు మౌళి.

"ఆ అనుభూతి మాత్రం అతని జీవితాంతం నిలచిపోతుంది. చీకటిలో 'ముద్దు' మాటలా? అదీ తెలియనిపిల్ల!" మౌళికి ఎదురుగా కూర్చున్న కుర్రాడు పెదవులు తడుముకున్నాడు.

శారీరకంగా నేను ఆ కంపార్ట్‌మెంట్ లోనే వున్నా- నా మనసు మూడేళ్ళ క్రితం మూసిన గతం గదుల్లోకి చొరబడుతోంది !

సరిగ్గా మూడేళ్ళక్రితం !...

ఆశ్చర్యం !

ఆ రోజుకూడా ఏప్రిల్ ఇరవై నాలుగు !

ఉదయం పదకొండు గంటలయి వుంటుంది. మరో గంటలో నేను ప్రయాణమై రాజమండ్రీ వెళ్ళాలి.

"కారు రెడీగా వుంది సార్!" అంటూ డ్రైవర్ వచ్చి నాకోసారి గుర్తుచేసి వెళ్ళాడు. సరిగ్గా అప్పుడే, నా జూనియర్ సరళాదేవి, నా దగ్గరకు వచ్చింది.

"మీరు రాజమండ్రీ వెడుతున్నారా?" నాకు ఎదురుగావున్న కుర్చీ లో కూర్చుంటూ అడిగింది.

"అవునండీ !"

"అక్కడ ఎన్నాళ్ళుంటారు ?"

"బహుశా నాలుగయిదురోజు లుండవలసి వస్తుంది. మన బ్రాంచ్ అకౌంట్స్ని కూడా చూడాలి !"

"నేను కూడా మీతో వస్తున్నాను."– సరళాదేవి అన్నది.

నేను వెంటనే ఆశ్చర్యపడలేదు.

"మీ బంధువులెవరైనా వున్నారా?" అడిగాను.

"ఎవరూ లేరు! మీతోనే వుంటాను." నా జవాబుకోసం ఎదురుచూడకుండానే, లేచి తన 'రూం'లోకి వెళ్ళిపోయింది... ఆశ్చర్యంనుంచి నేనింకా తేరుకొనకుండానే– తన 'హేండ్‌బ్యాగ్'తో మళ్ళా వచ్చి–

"షల్ వుయ్ గో?" అంది.

అనాలోచితంగానే నేను కదిలాను. మరో అయిదునిముషాల్లో మా కారు బయల్దేరింది. వాళ్ళపిల్లల తెలివితేటల గురించీ, వాళ్ళాయన కొంటున్న కారు గురించీ తప్ప– దారిలో మేం ఎక్కువగా ఏమీ మాట్లాడుకోలేదు. ఒక్కచోట మాత్రం కారు ఆపి, కాఫీ తీసుకున్నాం.

రాత్రి ఎనిమిదయ్యేసరికి మా కారు రాజమండ్రీ చేరుకుంది. డ్రైవరే చెప్పాడు, ఆర్యాపురంలో వున్న 'మనోరమా లాడ్జి' బాగుంటుందని.

సరళాదేవితో అలా హోటల్లోకి వెళ్ళటం నాకెందుకో ఇబ్బందిగాగానీ వింతగాకానీ అనిపించలేదు. చాలా దూరం ప్రయాణం చేసినందువల్ల ఒళ్ళంతా చిరాగ్గావుంది. స్నానంచేశాం. జడ వదులుగా అల్లుకుని– మెడచుట్టూ పౌడర్ జల్లుకుంది. తెల్లటిచీరలో చాలా అందంగా కనిపించింది. అంతకుముందు నేనెప్పుడూ సరళాదేవిని, అంత పరిశీలనగా చూడలేదు.

బోయ్‌ని పిలిచి, భోజనానికి ఆర్డరిచ్చాను.

"మీరు డ్రింక్ చేస్తారా ?"– సరళాదేవి అడిగింది. క్షణకాలం త్రుళ్ళిపడ్డాను.

"ఎప్పుడైనా ! అదికూడా కంపెనీ వుంటే !"

"నేనూ అంతే ! మీ కభ్యంతరం లేకపోతే, బోయ్‌ని పిలవండి... ఆర్డరిద్దాం. భోజనం తరువాత చెయ్యొచ్చు !"– నా సమాధానంకోసం చూడకుండానే, తన హేండ్‌బ్యాగ్‌లోంచి పదిరూపాయల కాగితాలు తీసింది.

'సరళాదేవికి ఎంతధైర్యం' అనుకున్నాను. మగవాడిగా, అంతకుమించి మరేమీ అనుకోవాల్సిన అవసరం నాకు కనిపించలేదు.

ఆ తెల్లవార్లూ మేం నిద్రపోలేదు.

నిజంగా అది మాటల్లో చెప్పలేని అనుభూతి !

ఆ మర్నాడు మధ్యాహ్నమే– 'మరి నేను వెడతాను'– అన్నది సరళాదేవి. ఆమె అలా అనగానే నాకెందుకో దిగులేసింది.

"ఎందుకనీ ?"– అడిగాను.

"వచ్చినపని అయిపోయిందిగా. ఇంక వెడతాను... అయినా నేను ఇక్కడే వుండిపోతే ఎలా ?... మీ పని చూసుకోరూ ?"– కళ్ళ చివళ్ళనుంచి చూస్తూ అడిగింది.

"నిజమే ! కానీ ఇప్పుడు నన్ను నేనే మరచిపోయాను. ఇంక పని ఎలా చేసుకోగలను ? నీ పెదాల్లో వేడినీ, చూపుల్లో వాడినీ, నా కందించి ఏవేవో అనుభూతుల అంచులకు నన్ను తీసుకొనిపోయావ్. తీరా ఇప్పుడు..." నన్ను పూర్తిగా చెప్పనివ్వలేదు సరళాదేవి.

"మనం ఎప్పుడూ ఇలాగే వుండిపోతే, ఆ అనుభూతి పలుచనైపోతుంది. మనుషులుగా దూరమైతేనే, మనసులు చేరువవుతాయి. అయినా నేనుమాత్రం ఎక్కడికి వెడతాను ? నాలుగురోజుల్లో మీరు హైదరాబాద్ తిరిగి రాగానే, మళ్ళీ మనం కలుసుకుంటాంగా"– అన్నది, తన చూపుడువేలుతో, నా నుదుటిమీద నుంచి పెదవులవరకూ గీస్తూ.

"కానీ ఈ గదిలో– నువ్వులేకుండా నేను... నేను ఒంటరిగా వుండగలనా అని ?"


"వుండగలగటమే గొప్పతనం. నేను లేకుండా మీరిక్కడ, ఈ నాలుగు రోజులూ ఎలా గడిపేదీ మీ డైరీలో రాయండి. మీరు రాగానే నాకు చూపించాలి."

ఆ తరవాత మరో రెండుగంటలకే, ఆమెను హైదరాబాద్ బస్ ఎక్కించాను. ఆ రాత్రి, ఆ గదిలో ఒంటరిగా పడుకున్న నాకు నిద్రపట్టలేదు. అంతకు ముందు రాత్రి సరళాదేవితో గడిపిన క్షణాలే, క్షణక్షణానికీ గుర్తుకొచ్చాయి.

"ఎన్నో జన్మలనుంచీ కలిసివుంటూ– ఈ జన్మలో మాత్రం ఎవరి శాపం వల్లనో, ఇలా వేరు వేరుగా జీవిస్తున్నామా!"అనిపించింది ఆ క్షణాన... హౌ సిల్లీ !

అసలు సరళాదేవి ఎందుకలా ప్రవర్తించింది ?

ఆమె భర్త ఏదో బిజినెస్ చేస్తూ బాగానే సంపాదిస్తున్నాడు. కుటుంబంలో ఏలాంటి కలతలూ వున్నట్లు నేను విన



చాలా బరువుగానూ, మరీ దిగులుగానూ గడచిపోయాయి.

తిరిగి హైదరాబాద్ చేరుకున్నాను.

ఆమెను చూడాలనీ, ఆమెతో మాట్లాడాలనీ, మనసు ఒకటే రొద చేసింది. మరొకరికి చెప్పుకోలేని అనుభూతి అది.

ఆఫీసుకు వెళ్ళగానే సరళాదేవికోసం చూశాను. ఆమె కూర్చునే సీటు ఖాళీగా వుంది. ఏ పని చేయటానికీ నాకు తోచలేదు. 'ప్యూన్' ని పిలిచి అడిగాను. సరళాదేవి రెండునెలలు శలవు తీసుకున్నట్లు చెప్పాడు. నాకు ఆశ్చర్యం అనుమానం ఒకేసారి కలిగాయి. కానీ నా మనోభావాలను పైకి కనపడనీయకుండా జాగ్రత్తపడ్డాను.

సరళాదేవి శలవు ఎందుకు పెట్టిందో అంతుపట్టలేదు. సిటీలో అందమైన ఇల్లుంది. ఇద్దరో ముగ్గురో పిల్లలుకూడా వున్నారు. ఎప్పుడూ నా ముందు ఎలాంటి హావభావాల్నీ ప్రదర్శించదు సరళాదేవి. ఇప్పుడెందుకిలా ప్రవర్తించింది ?

ఒకవేళ నేనుకూడా తప్పటడుగు వేశానా ? ఏమో ?... ఈ సంఘటనకు బాధ్యులెవరో నిర్ణయించాలనే ఉద్దేశ్యం కానీ- నిర్ణయించే అవసరంకానీ, నాకు కలగలేదు.

అనుకున్నపని అనుకున్న వ్యవధిలో పూర్తికాకపోవటంవల్ల మరో మూడు రోజులు కూడా రాజమండ్రిలోనే ఉండిపోవాల్సివచ్చింది. ఆ వారంరోజులూ- నట్టు : ఆమె భర్తకి మా విషయం తెలిసిపోయిందా ?

వివరాలు తెలుసుకోవాలనే ఉద్దేశ్యంతో, ఆ సాయంత్రమే వాళ్ళింటికి వెళ్ళాను. ఇంటికి తాళంవేసివుంది, ప్రక్కవాళ్ళు కూడా ఏమీ చెప్పలేకపోయారు.

రెండు నెలలూ గడచిపోయినా, సరళాదేవి తిరిగి రాలేదు. ఆమె చెప్పినట్టు మనుషులు దూరమయినకొద్దీ—మనసులు దగ్గరవుతాయేమో- అనిపించింది. ప్రతిరోజూ- ప్రతిరాత్రీ, సరళాదేవి గుర్తుకువస్తూనేవుంది. ఒకరోజున టపాలో ఆమెదగ్గర్నుంచి- ఉద్యోగానికి రాజీనామా ఇస్తున్నట్లు కాగితం వచ్చింది.

సరళాదేవి ఎందుకిలా చేసింది ?

ఈ ప్రశ్నకు ఎంత ఆలోచించినా సమాధానం దొరకలేదు. సమాధానాన్ని కోరే ఆ ప్రశ్న కాలగమనంలో పడి కనుమరుగయిపోతున్నా- ఎప్పుడైనా ఆ సందర్భం గుర్తుకువస్తే, మనసు నిండా ఆనందం నిండిపోతుంది. ఏదో మధురమయిన అనుభూతి దొరుకుతుంది!

ఇప్పుడు చంద్రమౌళి చెబుతున్న కథలో, ఆ ఆర్మీ ఆఫీసర్‌కి కూడా సరిగ్గా అలాంటి అనుభూతే కలిగి వుండాలి !

ఆ అనుభూతికి మాటలురావు...

ఆ అనుభూతికి ప్రాణంలేదు...

ఆ అనుభూతి వయస్సు మూడేళ్ళు !

ఆశ్చర్యం... సరిగ్గా ఆ రోజుకూడా ఏప్రిల్ ఇరవైనాలుగు!

ఓసారి గడియారంలోకి చూసుకున్నాను. అందులో ఇరవైనాలుగో తేదీ నన్ను ఉక్కిరిబిక్కిరి చేసింది.

రైలుపెట్టెలు ఒకదానినొకటి ఢీకొంటున్నట్టు- నా మనసేదో- నిర్ధారణ కొచ్చీ రానట్టు- రొద !

గబగబా నా బ్రీఫ్‌కేసునూ, మామిడి పళ్ళ బుట్టనూ తీసుకుని క్రిందకు దిగిపోయాను.

నేను కంపార్ట్‌మెంట్‌లోంచి క్రిందకు దిగుతూంటే, కళ్ళజోడు చంద్రమౌళి అన్నాడు-

"ఇది పలాసా కాదుసార్ ! ఇంకా రాజమండ్రీలోనే వున్నాం"- అని.

"అఫ్‌కోర్స్ ! నాది బ్రేక్‌జర్నీ !"—బదులుచెప్పి ముందుకు కదిలాను.

స్టేషనులోంచి బయటకు రాగానే. నా దగ్గరున్న లగేజ్ చూసి అక్కడున్న ఓ రిక్షావాలా "రమ్మంటారా సార్ ?"— అన్నాడు.

"మనోరమా లాడ్జికి వెళ్ళాలి,"

అంతే! ఆ తరువాత రిక్షావాలా ఏమన్నాడో- ఎంత ఇవ్వమన్నాడో నేను సరిగా వినిపించుకోలేదు. అందులో ఎక్కి కూర్చున్నాను.

గోదావరి గట్టుమీదనుంచి రిక్షాను తీసుకెడుతున్నాడు. గాలి చల్లగా తగులుతోంది. దూరంగా, మరీ దూరంగా నీలిరంగులో పాపికొండలు కనిపిస్తున్నాయి. గోదావరి బ్రిడ్జి క్రింద నుంచి లాంచీ ఏదో వెడుతోంది. పేపరు మిల్లునుంచి దట్టంగా వస్తున్న పొగ ఆకాశంలోని మబ్బుల్లో కలసిపోతోంది !

అవన్నీ చూస్తున్నా, మనసులో ఎలాంటి అనుభూతీ కలగటంలేదు. వాలుగాలికి రిక్షా తొందరగానే నడుస్తున్నా- కాలం మరీ నెమ్మదిగా గడుస్తున్నట్లనిపించింది.

కొన్ని నిముషాల తర్వాత రిక్షా 'మనోరమా లాడ్జి' ముందు ఆగింది. రిసెప్షన్‌లోకి నడిచాను.

"డబుల్‌రూం కావాలి !"

నావైపు ఓసారి పరిశీలనగా చూశాడు అక్కడున్న రిసెప్షనిస్టు. 'సింగల్'గా వచ్చి 'డబుల్‌రూం' కావాలంటాడేమిటి ? అనేభావం అతని చూపుల్లో కనిపించింది.

"రూంనంబరు ఫోర్టీన్ కావాలి"- మళ్ళీ అడిగాను.

ఓసారి వెనకవున్న బోర్డ్‌చూసి- "ఫోర్టీన్ ఖాళీగాలేదు సార్. సెవెన్టీన్ వుంది" అన్నాడు.

"నాకు పధ్నాలుగే కావాలి ! పోనీ అందులో వున్నవాళ్ళను పదిహేడులోకి వెళ్ళమని చెప్పకూడదూ ? ప్లీజ్" నా రిక్వెస్టుకి అర్థంలేదని నాకు తెలుసు.

కానీ నాకు పధ్నాలుగోనంబరు గదిలో- సరిగ్గా మూడేళ్ళక్రితం- అదే తారీఖున- సరళాదేవితో గడిపిన క్షణాలను మళ్ళీ మరోసారి మనసునిండా మననం చేసుకోవాలి.

"వీల్లేదు సార్ ! కావాలంటే రేపు ఉదయం ఆ 'గది' ఇస్తాం ! ఈ రాత్రికి మా త్రం పదిహేడోనెంబరులోనే వుండండి !" ఖచ్చితంగా చెప్పేసాడు రిసెప్షనిస్టు.

ఏం చెప్పటానికీ నాకు తోచలేదు. పోనీ ఓ పని చేస్తే ? ఆ రూంలో వున్న వాళ్ళను నేనే బ్రతిమాలి, వాళ్లను పదిహేడులోకి మారమని అడిగితే? ఆ 'కర్టెసీ' చూపించకపోరు.

"చూడండి ! పధ్నాలుగో నంబరు గదిలో వున్నవారిని నేనే ఒప్పిస్తాను. అప్పుడు మీకు అభ్యంతరం ఉండదుగా ?" ఆశగా అడిగాను.

"మీరు అదే 'రూం' కోసం ఎందుకింత పట్టుబడుతున్నారో నాకు అర్థం కావటంలేదు" అన్నాడు అతను కొంచెం చిరాకుతో.

ఆ 'రూం' కోసం నేను ఎందుకంత పట్టుబడుతున్నానో చెప్పినా అతనికి అర్థం కాదు... నిజమే మరి... ఆ 'రూం' నిండా సరళాదేవి నవ్వులు వున్నాయి. ఒకనాటి రాత్రి తనివి తీరకుండా మేం చెప్పుకున్న తియ్యని కబుర్లున్నాయి. ఆ గదిలో మా ఉచ్ఛ్వాస నిశ్వాసాలున్నాయి. నేనెప్పటికీ మరచిపోలేని అనుభూతుల ఆనవాళ్ళున్నాయి.

ఏదో ఆలోచిస్తూ, ఎటో చూస్తున్న నన్ను గమనించి-

"సరే మీ యిష్టం! వెళ్ళి ప్రయత్నించండి !" అన్నాడు మళ్ళీ.

మరునిముషంలో 'రూం నంబరు

ఫోర్టీను' దగ్గరకు చేరుకున్నాను. మూసి వున్న తలుపును చిన్నగా తట్టాను.

తలుపు తెరుచుకుంది... ఎదురుగా సరళాదేవి !

నా ఆశ్చర్యానికి అంతులేదు...సభ్యత కోసం విష్ చేయాలని కూడా మరచి పోయాను. దాదాపు ఆమె పరిస్థితీ అలాగే వుండి వుండాలి.

"మీరా ?" ఆశ్చర్యంనుంచి తేరుకుని అడిగింది సరళాదేవి.

"నేనే !"

"లోపలకురండి."

లోపలకువెళ్ళి కూర్చున్నాను. కొన్ని నిముషాలు మా యిద్దరికీ మాటలు దొరకలేదు.

'బోయ్'ని పిలిచి కాఫీకి ఆర్డరిచ్చింది.

"మిమ్మల్ని మళ్ళీ చూస్తానను కోలేదు" ఆసక్తిగా కుర్చీలోంచి ముందుకు వంగి అంది సరళాదేవి.

"చూస్తావనుకోలేదా ? చూడాలనుకో లేదా ?"

నా ప్రశ్నకు ఆమె కళ్ళల్లో కొంచెం వులికిపాటు కనిపించింది. అయితే, ఆ చూపులు నాకు కనిపించనీయకుండా, తన కళ్లను క్రిందకు దించుకుంది.

"నేను మాత్రం నిన్ను చూడాలని ఎంతగానో ఆరాటపడ్డాను."

సరళాదేవి బదులు చెప్పలేదు.

"అసలు ఎందుకిలా చేశావ్ ? నా జీవితంలోకి నువ్వెందుకు వచ్చావ్? నేను, కావాలని నిన్నెప్పుడూ కవ్వించలేదే ? సాఫీగా సాగిపోయే నదిలోకి, కెరటంలా ఉవ్వెత్తున వచ్చి- ఏవో అనుభూతుల ఆకాశాలకు ఎగరేసుకుపోయావ్." నా మాటలు ఆవేశంగా వున్నాయి.

"ఇంక చెప్పొద్దు...ప్లీజ్."తన ముని వేళ్లతో నా పెదాలు మూసేసింది.

ఆమె కళ్ళలోకి చూశాను. నీళ్లుపట్టిన దోసిళ్లులా కనిపించాయ్.

"వెరీ సారీ సరళా! నీ మనసు నొప్పిస్తే క్షమించు. తెలిసి, నేను ఎలాంటి తప్పటడుగూ వేయలేదు. తెగించి, నిన్ను నా దాన్నిగా చేసుకునే అవకాశం నాకూ లేదు- ఆ అర్హత నీకూ లేదు! మనిద్దరికీ సంసారాలున్నాయి. మనిద్దరిమధ్యా చట్టంవుంది. అయినా, నాకేదో ఆశను కల్పించావు. అది 'దురాశ' అని తెలుసుకోలేకపోయాను. ఇప్పుడు విచారిస్తున్నాను. అంతే !" మెత్తగావున్న ఆమె చేతి వేళ్ళను, నా రెండు చేతుల్లోకీ తీసుకుంటూ అన్నాను.

"మీ బ్రతుకులో గాలిదుమారం లేపి, పాపాన్ని మూటకట్టుకున్నాను. నా స్వార్థానికి ఎలాంటి శిక్షవేసినా అనుభ విస్తాను. కానీ జీవితంలో ఒక్కసారైనా గెలవగలిగాననే తృప్తీ, ఆ గెలుపులో వున్న అనుభూతీ పొందగలిగాను. అంతే చాలు !"

సరళాదేవి మాటలు నాకు అర్థం కాలేదు. ఆమె మళ్ళీ చెప్పటం ప్రారం భించింది.

"......మా అమ్మా నాన్నా, నన్ను ఎంతో గారంతో పెంచారు. అందుకు కారణం, నేను ఒక్కత్తినే సంతానం కావటం కావచ్చు. సంగీతం నేర్పిం చారు. చదువు చెప్పించారు. ఇంటర్మీడి యట్ పాసయినప్పుడు 'మెడిసిన్' లో చేరతానన్నాను. డాక్టరయితే జీవితంలో విశ్రాంతి దొరకదని బి.ఎ.లో చేర్పిం చారు నాన్న. నాకు జ్ఞానంవచ్చిన తరు వాత నేను పొందిన మొదటి ఓటమి అది!

"...... బి.ఏ. చదువుతున్న రోజు ల్లోనే, నా క్లాస్‌మేట్ శ్యాంసుందరంతో చనువేర్పడింది. క్లాసులో అతను ఎంత బ్రిలియంట్‌గా వుండేవాడో, అందంలో కూడా అంత హుందాగానూ కనిపించే వాడు.

"...... మేం ఇద్దరం ప్రేమించు కున్నాం. మా పెళ్ళికి నాన్నగారు ఒప్పుకోలేదు. అందుకు రెండు కారణా లున్నాయి. మొదటిది- శ్యాంసుందరం మా కులంవాడు కాకపోవటం; రెండోది- ఆస్తి అసలే లేకపోవటం. అందుకే నేను మళ్ళీ ఓడిపోయాను. జీవితంతో రాజీ పడి, నాన్న తెచ్చిన సంబంధానికి తల వంచాను.

"......ఆయన ఓ కంపెనీ మేనే జరు. నన్ను ప్రేమతోనే చూసు కుంటారు. ఆయన సాన్నిధ్యంలో ఓ ఆదర్శగృహిణిగా గడపాలని నిర్ణయించు కున్నాను. అక్కడకూడా మళ్ళీ ఓటమే ఎదురయింది. 'ఎలాగా బి.ఎ. చదువు కున్నావ్ కదా, ఉద్యోగం చెయ్యి' అన్నా రాయన. ఆయనే తన పలుకుబడిని ఉపయోగించి, ఉద్యోగం ఇప్పించారు. ఇష్టంలేకపోయినా ఉద్యోగంలో చేరాను." చెప్పటం ఆపి నిట్టూర్చింది సరళాదేవి.

"పోనీ ఉద్యోగంచేయటం ఇష్టంలేదని చెప్పవలసింది !"

"చెప్పాను ! కానీ ఆయన వినరు. ఎదుటిమనిషే తన మాటను వినేలా చేస్తారు. తాను నవ్వుతూ మనల్ని నవ్వి స్తారు. అలా నవ్విస్తూనే, ఒప్పిస్తారు. అది ఆయనలోని ప్రత్యేకత. మరో ప్రత్యేకత కూడా ఆయనలో వుంది. ప్రతిరోజూ రాత్రి ఆయన త్రాగుతారు. అప్పుడప్పుడూ, నన్నూ త్రాగమని బల వంతం చేసేవారు. నేను వద్దంటే ఆయన ఏడ్చేసేవారు. ఆయనకోసం త్రాగటం నేర్చుకున్నాను. అదికూడా నా ఓటమే !

"......ఇలా నా జీవితంలో నేను అనుకున్నది ఏదీ జరగలేదు. కోరు కున్నది ఏదీ నాకు దొరకలేదు. కానీ... అలా అనుకున్నదీ, కోరుకున్నదీ దొరికి నప్పుడు ఎలాంటి అనుభూతి కలుగు తుందో తెలుసుకోవాలనే కోరిక మాత్రం నాలో మిగిలిపోయింది.

"...... అప్పుడే- అలా జీవితంతో రాజీపడుతున్నపుడే- ఓ రాత్రి ఓ కల వచ్చింది. చాలా విచిత్రమైన కల. చెప్ప మంటారా ?" అడిగింది సరళాదేవి.

ఏమిటీ అన్నట్లు చూశాను...ఆమె చెప్పింది.

"ఆ గదిలో వెలుగు నీలంగా వుంది. అక్కడిగాలి చల్లగా వుంది. పైన 'ఫాన్' మెత్తగా తిరుగుతోంది. ఆ ఫాను క్రింద మెత్తటి పరుపుమీద- మీరు రెండు చేతులూ మెడక్రింద పెట్టుకుని వెల్లకిలా పడుకున్నారు. మీ గుండెలమీద నేను తల పెట్టుకుని, బరువుగా, వాలిపోతున్న కళ్ళతో- మీ కళ్ళలోకి చూస్తూ- ఏవేవో కబుర్లు చెబుతున్నాను. ఆ కబుర్లు మీరు వింటూనే, నా కురులు సవరిస్తున్నారు.

"... అంతే! ఆ తరువాత నా కల చెదిరిపోయింది. మెలకువ వచ్చింతరువాత వాస్తవాన్ని గ్రహించి సిగ్గుపడ్డాను!

"... అయినా ఆ కల నిజమయితే? ఎలాంటి అనుభూతి కలుగుతుందీ? జీవితంలో ఆ అనుభూతైనా మిగిలితే, జీవితాంతం దాన్ని దాచుకోవచ్చనను కున్నాను. పిచ్చిదాన్ని! అందుకే నా స్వార్థానికి మిమ్మల్ని వాడుకున్నాను." చెప్పటం ముగించి నావైపు చూసింది సరళాదేవి.

ఆమె పరిస్థితికి జాలిపడాలో నా పరిస్థితికి దిగులుపడాలో తెలియలేదు.

"నీ స్వార్థంతో నన్ను పిచ్చివాణ్ని చేశావ్. నీ కలను నువ్వు నిజం చేసుకున్నావ్. కనీసం నా కళ్ళకైనా కనిపించకుండా కలన్నే నాకు మిగిల్చి పారిపోయావ్."

"నిజమే! అంతకుమించి నేనేం చేయగలను? మనిద్దరం ఎవరికి వారుగా ఒక పరిధిలో జీవిస్తున్నవాళ్ళం. ఆ పరిధిలోంచి బయటకు రావటమంటే, నైతికంగా దిగజారిపోవటమే! మగవాళ్ళు ఏం చేసినా చెల్లుబడయిపోతుంది. కానీ నా విషయం అలా కాదు. నన్ను ప్రేమించే నా భర్తా, నేను ప్రేమించే నా పిల్లలూ నా కున్నారు. అందుకే మళ్ళీ మీకు కనిపించకుండా దూరమైపోవాలని నిర్ణయించుకున్నాను."

"మనుషులు దూరమైనా, మనసులు దూరం కావని ఓసారి నువ్వే అన్నావ్!" ఆమె మాటను ఆమెకే వప్పచెప్పిన సంతృప్తితో అన్నాను.

సరళాదేవి నవ్వింది. ఆ నవ్వులో విరక్తి, నిరాశా తప్ప మరేమీలేవు.

"నా మానసిక పరిస్థితిని అర్థంచేసుకుంటే మీరలా మాట్లాడరు. నాకు మనసంటే ఏమిటో తెలిసినప్పటినుంచీ, ఆ మనసుమీద ఓటమి దెబ్బతీస్తూనేవుంది. అనుకున్నది అనుభవంలోకి వస్తే ఎలాంటి అనుభూతి దొరుకుతుందో తెలుసుకోవాలనుకున్నాను. నేను చేసింది పాపమయినా, వేసింది తప్పటడుగే అయినా, ఓ విచిత్రమైన అనుభూతి మిగిలిపోయింది. ఆ సంఘటన జరిగిన తర్వాత, మళ్ళీ మనం కలుసుకుంటే మన పరిస్థితి మరోలా వుండేది! అప్పుడు నా అనుభూతి పలుచనైపోయేది. అందుకే దాన్ని మనసులో, మారుమూల భద్రంగా దాచుకోవాలనుకున్నాను. మీ నుంచి దూరమై- ఇక్కడకొచ్చేశాను. మావార్ని ఒప్పించి-ఇక్కడ 'ఇండస్ట్రీ' పెట్టించాను. 'సిరమిక్ ఫ్యాక్టరీ' పెట్టారు."

సరళాదేవి చెప్పటం ముగించేసరికి 'బోయ్' రెండుకప్పులతో కాఫీ తీసుకొచ్చి, అక్కడ పెట్టి వెళ్ళిపోయాడు.

"ఇంతకీ ఇక్కడ నేనున్నట్లు మీకెలా తెలుసు? ఏదైనా పనిమీద వచ్చారా?" కాఫీ తాగుతూ అడిగింది.

"కంపెనీ పనిమీద కలకత్తా వెడుతున్నాను. వైజాగ్‌లో ఎక్కడో, 'గూడ్స్' పట్టాలు తప్పిందని ఇక్కడి స్టేషన్లో, నేనెక్కినబండిని నిలిపేశారు. గడియారంలో 'టైం' చూసుకుంటే- ఇరవైనాలుగో తారీఖు కనిపించింది. సరిగ్గా మూడేళ్ళక్రితం ఇదే గదిలో- ఇదే తారీఖున నీతో గడిపిన క్షణాలు మళ్ళీ గుర్తుకొచ్చి మదనపెట్టాయి. వాటిని మనసారా గుర్తుచేసుకోవాలని ఇక్కడే దిగిపోయి ఇలా వచ్చాను. తీరా వస్తే, ఈ గది ఖాళీగా లేదన్నారు. అయినా ఇందులో వున్నవారిని నేనే ప్రతిమాలి - మరో గదికి పంపించే ఏర్పాటు చేస్తానని వచ్చాను. తీరా చూస్తే నువ్వు!"

"ఆనాటి మన ప్రవర్తనే విచిత్రమనుకుంటే- ఈనాటి మన కలయిక మరీ విడ్డూరంగా లేదూ?" అడిగింది సరళాదేవి.

"ఇంతకీ నువ్వు ఇక్కడ ఎందుకున్నదీ చెప్పలేదు!" అడిగాను.

"నేను ప్రతి నెలా ఈ తారీఖున, ఈ హోటల్లో, ఇదే గది తీసుకుని ఒంటరిగా గడుపుతూంటాను. నెల పొడుగునా యాంత్రిక జీవనం గడిపే నాకు, ఈ ఒక్కరోజూ, ఎక్కడో పారేసుకున్న తృప్తీ, అనుభూతీ, ఇక్కడ దొరుకుతూంటాయి." ఆమె ఆ విధంగా చెబుతూంటే, ఆ కళ్లల్లో ఏదో వెలుగే కనిపించింది నాకు.

"మరి మీ ఆయన నీకేమీ అభ్యంతరం చెప్పరా?" అడిగాను.

"నన్నెంతగా ప్రేమిస్తారో- అంతగానూ ఆయన నన్ను నమ్ముతారు. ఆ నమ్మకంతోనే నాకిలా 'మంత్లీ ఆఫ్' గ్రాంట్ చేస్తూంటారు. నాకు దొరికిన అనుభూతినీ- ఆయనకున్న నమ్మకాన్నీ నేనెప్పుడూ చెరుపుకోను!" చిన్నగా నవ్వుతూ చెప్పింది సరళాదేవి.

ఇక నాకేమీ మాటలు దొరకలేదు. అక్కడనుంచి లేచి నా బ్రీఫ్‌కేసు తీసుకుని—

"మరి నేను వెడతాను" అన్నాను.

తనుకూడా లేచి నిలబడి- "మీ బుట్ట వదిలేశారు" అంది.

"అందులో మామిడిపళ్ళున్నాయి. నీ పిల్లలకు 'అంకుల్ ఇచ్చాడని చెప్పు'... వస్తాను... గుడ్‌బై"—

బయటకు వచ్చి మళ్ళీ రిక్షా ఎక్కాను.